
గోషామహల్‌లో.. బీసీ సెల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కోటి శైలేష్ కురుమ


పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, కార్పొరేటర్ రాజ్‌మోహన్


పోలియో చుక్కలు వేస్తున్న పులిపాటి రాజేష్ కుమార్, భానుచందర్


పోలియో చుక్కలు చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్


పోలియో చుక్కలు వేస్తున్న రవిరాజ్, శ్రీనివాస్, శశి యాదవ్


గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో పిల్లలకు చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కౌసర్


పోలియో చుక్కలను వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పల్స్ పోలియోకు విశేష స్పందన

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్ద, కాలనీ కమ్యూనిటీహాళ్లు, వివిధ కూడళ్లు, బస్‌స్టాప్‌లు, రైల్వే స్టేషన్‌ల వద్ద, మొబైల్ టీమ్స్ ద్వారా పోలియో చుక్కల పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యేలు, పలువురు కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


షేక్‌పేట వినాయక్‌నగర్‌లో..


గుడిమల్కాపూర్‌లో..


గుడిమల్కాపూర్‌లో.. బీజేపీ నాయకుడు దేవర వంశీ


ఉప్పుగూడలో.. కార్పొరేటర్ ఫహద్, నాగరాజు


చుక్కల మందు వేస్తున్న కార్పొరేటర్ సురేఖ, భీశ్వ ఓంప్రకాష్


విజయనగర్‌కాలనీ మహిళా మండలిలో..


లంగర్‌హౌస్‌లో..

సన్మానం


బీబీపాటిల్‌ను కలిసి అభినందనలు తెలియజేస్తున్న శ్యాం సుందర్ లోయా

చార్మినార్: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్ విజయం ఖాయమని శ్రీ సర్వో నటరాజ్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్యాం సుందర్ లోయా తన ఆశాభావం వ్యక్తం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం ప్రకటించిన సందర్భంగా ఆయనను కలిసి బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజల్లో బీబీపాటిల్‌కు మంచి ఆదరణ ఉందన్నారు.


పట్టాలు పొందిన చిన్నారులు

ఆకట్టుకున్న స్నాతకోత్సవం

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాలలో యుకేజీ విద్యార్థినుల స్నాతకోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ముఖ్యఅతిథులుగా సీఎస్ఎస్ఏ మదర్ జనరల్ రెవరండ్ ఆంథోనమ్మ, ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ అడిషనల్ కంట్రోలర్ అండ్ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ సంగీత కురిడే హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ప్రిన్సిపాల్ రెవరండ్ సిస్టర్ ఆరోగ్యమేరి దివ్య, కరస్పాండెంట్ రోజీ ఫ్రాన్సిస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యువ కవయిత్రుల అధ్యయన శిబిరానికి స్పందన


అధ్యయన శిబిరంలో పాల్గొన్న వక్తలు

సుల్తాన్‌బజార్: సాహిత్య వికాసానికి కొత్త తరాన్ని తయారు చేయాలన్న సంకల్పంతో తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహిస్తున్న కార్యక్రమాల పరంపరలో ఆదివారం ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర స్థాయి యువ కవయిత్రుల సమ్మేళనానికి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాలకు చెందిన డిగ్రీ స్థాయి విద్యార్థినులు 80 మందికి పైగా హాజరై కవిత్వ రచనలో మెళకువలను అధ్యయనం చేశారు. వచన కవిత్వం రాయడానికి నియమాలు ఏమీ లేకపోయినా వస్తు వైవిధ్యం, శిల్ప నవ్యత ఉండాలని పాఠకులకు ఆసక్తి కలిగించే శీర్షికతో ప్రారంభించి కవితను కడదాక చదివించే విధంగా మంచి ఎత్తుగడ, నిర్వహణ దక్షత, ఆకట్టుకునే ముగింపు కవితకు చాలా అవసరమని వక్తలు సూచించారు. పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రముఖ కవి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీనివాసచార్య, పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, ప్రొఫెసర్ దాసోజు పద్మావతి, బాల సాహిత్యవేత్త అశోక్ పాల్గొని యువ కవయిత్రులకు సలహాలు, సూచనలు అందించారు.

పబ్లిక్‌గార్డెన్స్‌ను వ్యాపార కేంద్రంగా మార్చేశారు!



పబ్లిక్ గార్డెన్స్‌ను కాపాడాలంటూ ర్యాలీ చేపట్టిన వాకర్స్

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్స్‌ను పాలకులు గాలికి వదిలేశారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పర్యాటక, సాంస్కృతిక, పర్యావరణ శాఖలు ప్రత్యేక దృష్టిని సారించాలని పబ్లిక్‌గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశాయి. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ పబ్లిక్ గార్డెన్స్‌లో వాకర్స్ గర్జన చేపట్టారు. పర్యావరణ వేత్త మహ్మద్ ఆబిద్ అలీ నేతృత్వంలో గార్డెన్‌లో ర్యాలీ చేపడుతూ పర్యావరణపై అవగాహన కల్పించారు. పబ్లిక్ గార్డెన్స్‌లో చెట్లను కొట్టి వేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ మ్యూజియం, హెల్త్ మ్యూజియం, బాలభవన్, తెలుగు లలిత కళాతోరణం ప్రాంగణాలను ఆధునీకరించాలని కోరారు. సందర్శకుల సౌకర్యార్థం కనీస సదుపాయాలు కంటికి కానరావడం లేదన్నారు. పార్కును పూర్తిగా ఉద్యానవన శాఖ అధికారులు కమర్షియల్ కేంద్రంగా మార్చేశారని ఆరోపించారు. అలాగే ఉద్యానవన శాఖ అధికారులు పార్కులో కమర్షియల్ పార్కింగ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాల బస్సులను ఎట్టి పరిస్థితుల్లో లోనికి అనుమతించవద్దని కోరారు. తెలుగు లలిత కళాతోరణం పూర్తిగా ప్రైవేట్ పాఠశాలలకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఎన్టీఆర్ పార్కు, లుంబినీ పార్కు, ఇందిరా పార్కుల్లాగా పబ్లిక్ గార్డెన్స్‌ను అభివృద్ధి చేయాలని కోరారు.

అభినందనలు

గోల్కొండ: అత్యున్నత విద్యా ప్రమాణాలతో పాటు విద్యార్థినులకు వివిధ క్రీడా అంశాల్లో కూడా శిక్షణ ఇస్తున్నామని మెహిదీపట్నంలోని సెంటాన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ విజయరాణి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో సెంటాన్స్ కళాశాల వరుసగా 14వ సారి కూడా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించిందిన సందర్భంగా ఆదివారం కళాశాలలో విజయ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా అంశాల్లో పతకాలు, ట్రోఫీలు సాధించిన వారిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినుల కోరిక ప్రకారమే వారికి కోచ్‌లచే తర్ఫీదు ఇస్తున్నామన్నారు. చదువుతో పాటు క్రీడలకు తమ కళాశాల కేంద్ర బిందువుగా నిలిచిందని ఆమె అన్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో కళాశాల విద్యార్థినులు ఐదు బంగారు పతకాలు, మూడు వెండి, ఐదు కాంస్య పతకాలను సాధించారన్నారు.


పతకాలు, మెమొంటోలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ విజయరాణి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ హిందీనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని హిందీనగర్, చాక్నావాడి, శివ్‌కుమార్‌లాల్ స్టేడియం తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కేవీ గ్యాస్‌బాగ్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గ్యాస్‌బాగ్ కాలనీ, గోడేకీ కబర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు, 11 కేవీ జించి చౌరా విద్యుత్ ఫీడర్ పరిధిలోని జించి చౌరా, బోయిగూడ కమాన్ తదతర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

గోల్కొండ కోట కందకాల క్లీనింగ్‌కు లైన్ క్లియర్

గోల్కొండ: గోల్కొండ కోట ప్రహరీ చుట్టూ ఉన్న కందకాలను శుభ్రం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించిందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తెలిపారు. కోట కందకాల పూడికతీతల కోసం తాను గతంలో కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ డైరెక్టర్ జనరల్‌కు ఉత్తరం రాయడం జరిగిందన్నారు. ఈ పూడికతీత పనులకు తమకు అభ్యంతరం లేదంటూ ఆ శాఖ డైరెక్టర్ జనరల్ పంపిన ఉత్తరం తనకు వచ్చిందని ఆయన తెలిపారు. త్వరలోనే బల్దియా కమిషనర్‌తో పాటు ఇతర శాఖల అధికారులతో కలిసి కోట కందకాలను పరిశీలిస్తామన్నారు. అధికారుల సలహాలు, సూచనల మేరకు కోట కందకాలు శుభ్రం చేస్తామని ఆయన అన్నారు. కోట కందకాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


పర్వతాల రాజేందర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట న్యూ ఇంద్రానగర్‌లోని బోలేనాథ్ ఆలయంలో శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం వైభవంగా కొనసాగింది. టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి అతిథిగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రవి, మణిశంకర్, శ్రీహరి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం



గౌలిపురా: అయోధ్యనగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ (కేటీఎస్)లో రంగోత్సవ పేరుతో శనివారం రాత్రి వార్షికోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కె.తిరుమల్ రెడ్డి, ఛత్రినాక కేటీఎస్ బ్రాంచ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.రామకృష్ణ యాదవ్ హాజరై వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటా పాటలతో ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ మంజుల నీలం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'తెలంగాణ తరహాలో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తాం'


నిర్మల్‌కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న యాదవ్ హైరీ సమాజ్ నాయకులు

అబిడ్స్: తెలంగాణ తరహాలో ఉత్తరప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా కృషి చేస్తానని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ ఇన్‌చార్జ్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్‌కు చెందిన నిర్మల్‌కుమార్ యాదవ్‌ను ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమించడంతో ఆదివారం బేగంబజార్‌లోని యాదవ్ హైరీ సమాజ్ రాష్ట్ర నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ..కార్యకర్తలు, యాదవ కులస్తులంతా కలిసికట్టుగా పనిచేసి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు కృషిచేసుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, యాదవ సంఘం నాయకులు ప్రేమ్‌లాల్, డి.శంకర్, భవాని శంకర్ చౌదరి, గోపాల్‌చౌదరి, మహ్మద్ జహంగీర్, శ్యామ్‌సింగ్, చిత్తరంజన్ ఠాకూర్, బద్రీనాథ్, బబ్లుసింగ్, జైదీప్, దుర్వేష్ అహీర్, నర్సింగ్‌భాన్ యాదవ్, శంకర్‌సింగ్, అరుణ్‌యాదవ్ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన అదుర్స్



నాంపల్లి: నిజాంపేట బండారీ లేఅవుట్ రోడ్డు నెం-4లో ఉన్న వివేక చూడామణి కూచిపూడి, భరతనాట్యం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వివేక చూడామణి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. అనంతరం పలువురు నాట్య గురువులను, వివిధ రంగాలకు చెందిన కళాకారులను సన్మానించారు. స్వర సామ్రాట్ ఆర్.నాగరాజ్ ప్రసాద్, (మ్యూజిక్ వోకల్), చింతా శివ ఆదినారాయణ (యక్షగాన సార్వభౌములు), సంతోష్‌కుమార్ తమంగ్ (నాట్య గురువు), యు.కోటేశ్వరరావు (చిత్రలేఖనం), కె.సత్యభామ (మ్యూజిక్, వోకల్ అండ్ వీణ)లను సత్కరించారు.

త్వరలో గోల్కొండ ఆసుపత్రిలో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ కేంద్రం


మహ్మద్ యూనుస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి త్వరలోనే హజ్ యాత్రికుల కోసం వ్యాక్సినేషన్ కేంద్రం ప్రారంభం కానుందని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా తెలిపారు. ఈ సంవత్సరం హజ్ యాత్రకు ఎంపికైన మహ్మద్ యూనుస్‌ను ఆదివారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి షేక్, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వినాయక్‌రావు, పీస్ అండ్ మైత్రి కమిటీ అధ్యక్షుడు ఆబీద్, ఇలియాస్ అలీ తదితరులున్నారు.

ఆర్థోపెడిక్ ఉచిత శిబిరానికి స్పందన



గోల్కొండ: శరీరంలోని ఎముకలు, జాయింట్స్, వెన్నెముక్కలపై ఎంతో శ్రద్ధ అవసరమని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ సాధన్ పాలకూరి అన్నారు. ఆదివారం షేక్‌పేట్ ఓయూ కాలనీలో పీవీజీ ఆర్థోపెడిక్ సెంటర్‌లో ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన 43 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..గుర్తు తెలియని యువకుడు (35) లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి


మాట్లాడుతున్న మొకాల వెంకటేశ్

గౌలిపురా: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మొకాల వెంకటేశ్ అన్నారు. ఆదివారం గౌలిపురాలో హైదరాబాద్ పార్లమెంటు ఓబీసీ సామాజిక సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ చంద్రశేఖర్, పార్లమెంటు కో ఇన్‌చార్జి ప్యారసాని వెంకటేశ్, గౌలిపురా డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, రాజ్ కుమార్, ప్రేమ్‌రాజ్, సాయి కుమార్, శోభారాణి, సురేందర్, రమేశ్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



సాక్షి, సిటీబ్యూరో: శ్రీ చైతన్య విద్యా సంస్థలు (మెహిదీపట్నం–గోషామహల్) శాఖల వార్షికోత్సవం ఉత్సాహంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎ.జి.ఎం బి.కృష్ణ, సినీ నిర్మాత వర్మ, అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు జె.రమేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సభా ప్రారంభంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు బి.ఎస్.రావుకు నివాళులర్పించారు. అనంతరం గత ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెహిదీపట్నం జోన్ ఆర్ఐ హరికృష్ణ, గోషామహల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, మెహిదీపట్నం శాఖ ప్రిన్సిపాల్ స్వాతి, అకాడమిక్ కో ఆర్డినేటర్స్ రవికుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జీవిత చరిత్ర రచనలు స్ఫూర్తిదాయకం

సుల్తాన్‌బజార్: జీవిత అనుభవాలతో స్ఫూర్తిదాయకమైన రచనలు రావాలని దేవాదాయ శాఖ మాజీ కమిషనర్ ఎస్.ముక్తేశ్వర్‌రావు అన్నారు. హ్యూమన్ వెపన్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వతి పరిషత్ ఆడిటోరియంలో శ్రీనివాస భాను రచించిన 20x20 చదరపు అడుగులు అనే పేరిట ప్రముఖ బాక్సర్ ఇమని చిరంజీవి జీవిత చరిత్ర ఆధారంగా రచించిన గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముక్తేశ్వర్‌రావు హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేధావులైన వారిని జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతగానో పయోగపడుతుందన్నారు. రచయిత రాసిన తీరు తనను ఆకట్టుకుందన్నారు.

సందడిగా వార్షికోత్సవం



నాంపల్లి: న్యూజెన్ 15వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని తెలుగు లలిత కళాతోరణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ జయ ప్రకాష్ నారాయణ, విరించి ఆసుపత్రి చైర్‌పర్సన్, హైదరాబాదు పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలత హాజరై జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. సభా ప్రారంభంలో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఇంక్విలాబ్ చేవెళ్ల అభ్యర్థిగా కవి అబ్బాసీ



చార్మినార్: ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా మొగల్‌పురాకు చెందిన మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీని ఖరారు చేసినట్లు ఆ పార్టీ అఖిల భారత అధ్యక్షుడు సయ్యద్ హమీద్ హుస్సేన్ సుత్తారీ వెల్లడించారు. ఆదివారం మొఘల్‌పురాలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేయనున్నారన్నారు. ఇందులో భాగంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పార్టీ అధికార ప్రతినిధి, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ అయిన మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ పోటీ చేయనున్నారన్నారు.

అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా లింగేశ్వర్‌రావు



అబిడ్స్/అఫ్జల్‌గంజ్: అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా జి.లింగేశ్వర్‌రావు పదవీబాధ్యతలు స్వీకరించారు. కొన్ని రోజులుగా ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హరిభూషణ్ రావును ఎన్నికల బదిలీల ప్రక్రియలో భాగంగా బదిలీ చేయడంతో ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న లింగేశ్వర్‌రావును ఆయన స్థానంలో నియమించారు. ఆదివారం పదవీబాధ్యతలు స్వీకరించిన లింగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. స్థానిక ప్రజల సహకారంతో ఫ్రెండ్లీ పోలీస్‌సింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ అసాంఘిక శక్తులపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా బాలు చౌహాన్




అబిడ్స్: షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాలు చౌహాన్ పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన నాగం రవీందర్ బదిలీ కావడంతో వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలు చౌహాన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. గతంలో టప్పాచబుత్ర మంగళ్‌హాట్, పంజగుట్ట, బేగంబజార్, రేయిన్‌బజార్, మీర్ చౌక్ పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన బాలు చౌహాన్ మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు.

క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

గన్‌ఫౌండ్రీ: క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం నిజాం కళాశాల మైదానంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సికింద్రబాద్ పార్లమెంట్ క్రికెట్ లీగ్ ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడాకారులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఉండడం ఎంతో గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాష్ట్ర నాయకులు ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట ఆదివారం జాతరను తలపించింది. ఉదయం 9 నుంచే కోట టికెట్ కౌంటర్ ముందు పర్యాటకులు బారులు తీరాలు. భారీ సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో కోటలోని ప్రధాన ఆకర్షణ ప్రదేశాలైన ఫిరంగి, క్లాపింగ్ పోర్టిగో, ఆయుధాగారం తదితర ప్రాంతాల్లో పిల్లలు, పెద్దలు భారీగా కానవచ్చారు. పలువురు విదేశీ పర్యాటకులు క్లాపింగ్ పోర్టిగో విశేషాలను అక్కడ ఉన్న హిస్టరీ గైడ్స్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వేసవి సెలవులు రానున్నాయని ఇక నుంచి పర్యాటకులు ప్రతినిత్యం వేల సంఖ్యలో కోటకు వస్తాయని గోల్కొండ కోట హిస్టరీ గైడ్స్ గౌరవ అధ్యక్షుడు మహ్మద్ హర్షద్ తెలిపారు.